**26-02-2022** ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - రోజూ అమృతవేళ జ్ఞానం మరియు యోగం యొక్క ధూపాన్ని వెలిగించినట్లయితే వికారాల రూపీ భూతాలు పారిపోతాయి"

ప్రశ్న:- ఏ ఒక్క పొరపాటు అనేక భూతాలను లోపల ప్రవేశించేలా చేస్తుంది?

జవాబు:- నేను ఆత్మను, ఈ విషయాన్ని మర్చిపోయినట్లయితే, అనేక భూతాలు లోపలికి ప్రవేశిస్తాయి. దేహాభిమానం యొక్క భూతం అన్నింటికన్నా పెద్దది, దాని వెనుక అన్నీ వచ్చేస్తాయి. అందుకే, ఎంత వీలైతే అంత దేహీ-అభిమానులుగా అయ్యే పురుషార్థం చేయండి.

గీతము:- నేడు మానవుడు అంధకారంలో ఉన్నాడు... (ఆజ్ అంధేరే మే హై ఇన్సాన్...)

ఓంశాంతి. తండ్రి కూర్చొని పిల్లలకు ఈ పాటపై అర్థం చేయిస్తారు. భగవంతుడు వచ్చి మా నేత్రాలకు వారి సాక్షాత్కారాన్ని చేయించాలి అని భక్తులు భగవంతుడి నుండి కోరుకుంటారు. ఇప్పుడు పిల్లలైన మీరైతే సమ్ముఖంలో కూర్చుంటారు. మీరు ఈశ్వరుడిని పొందారు, ఈ నేత్రాలతో చూసారు. ఈశ్వరుడిని ఎలా పొందాల్సి ఉంటుంది, ఈ విషయాన్ని వారే స్వయంగా వచ్చి తెలియజేస్తారు అనగా ఈ జ్ఞానాన్ని ఇస్తారు. ఈ తనువు ద్వారా అర్థం చేయిస్తారు. ఆత్మలైన మీరందరూ కూడా ఈ తనువు ద్వారా మీ-మీ పాత్రలను అభినయిస్తారు, శరీరం లేకుండానైతే ఎవరూ పాత్రను అభినయించలేరు. పాత్రను ఆత్మనే శరీరం ద్వారా అభినయిస్తుంది. శరీరానికి భిన్న-భిన్న పేర్లు పెట్టడం జరుగుతుంది. ఆత్మ అయితే ఒక్కటే. ఆత్మ స్వయంగా అంటుంది మరియు తండ్రి కూడా అర్థం చేయిస్తారు, 84 జన్మలను ఆత్మ తీసుకుంటుంది అని. నేను ఒక శరీరాన్ని వదిలి మరొకటి తీసుకుంటాను అని ఆత్మ అంటుంది. శరీరమైతే అనదు కదా. మేము ఆత్మలము, అంతేకానీ, శరీరాలము కాము అని ఇప్పుడు పిల్లలైన మీరైతే తెలుసుకున్నారు. బాబా వచ్చి మనల్ని ఆత్మాభిమానులుగా చేస్తారు. ఈ శరీరం ద్వారా ఆత్మనే అంతా చేస్తుంది. శరీరం లోపల ఉన్న ఆత్మ అంటుంది, ఈ శరీరం ద్వారా నేను నడుస్తున్నాను, తిరుగుతున్నాను, ఆత్మనైన నేను జడ్జి, వకీలు మొదలైనవారిగా అవుతాను అని. ఆత్మ అంటుంది, నేను ఈ శరీరం ద్వారా రాజయోగాన్ని నేర్చుకుంటాను, తర్వాత వెళ్ళి రాజు-రాణుల వస్త్రాలను ధరిస్తాను. ఇప్పుడు మిమ్మల్ని ఆత్మాభిమానులుగా చేయడం జరుగుతుంది. దేహాభిమానంలోకి రావడము - ఇదే మొదటి నంబరు పొరపాటు, దీని వలన ఇతర పొరపాట్లు కూడా జరుగుతాయి. దీనిని దేహాభిమానం యొక్క భూతం అని అంటారు. ప్రతి ఒక్క మనిషిలో 5 భూతాలైతే తప్పకుండా ఉన్నాయి. భూతాలను పారద్రోలేందుకే ధూపాన్ని వెలిగించడం జరుగుతుంది. ఈ 5 వికారాల రూపీ భూతాలకు ధూపము జ్ఞానము మరియు యోగము. ఇవి అంత త్వరగా ఏమీ పారిపోవు. వీటిని భట్టీలో వేయడం జరుగుతుంది ఎందుకంటే ఈ 5 వికారాలు చాలా పురాతనమైన శత్రువులు. తండ్రి అంటారు, పిల్లలూ, మీలో ఈ భూతాలు ప్రవేశించి అర్ధకల్పం అయింది. రావణ రాజ్యం ప్రారంభమైనప్పటి నుండి ఇవి ఉన్నాయి. తప్పకుండా భారతవాసులు రావణుడిని శత్రువుగా భావిస్తూ కాలుస్తారు. ఒక్కసారి ఇతడు అంతమయ్యాక, అప్పుడిక అది ఒక ఆచారంగా కొనసాగుతూ వస్తుంది. ఈ సమయంలో మీరు ఈ 5 వికారాలపై విజయం పొందారు. రావణుడు అర్ధకల్పం కోసం ముర్దాబాద్ అయ్యాడు (అంతరించిపోయాడు). పిల్లలు అంటారు, బాబా, మరి ఇతడు ఎప్పుడు జిందాబాద్ అవుతాడు? పిల్లలూ, మళ్ళీ అర్ధకల్పం తర్వాత జిందాబాద్ అవుతాడు, తన రాజ్యం చేస్తాడు. రామరాజ్యం కావాలని అంటారు కదా, మరి ఇప్పుడు ఏ రాజ్యముంది? రావణ రాజ్యం ఉంది కదా. సత్యయుగంలో రావణ రాజ్యమే ఉండదు. అక్కడ రామ రాజ్యం ఉంటుంది. అచ్ఛా, రామ రాజ్యంలో మొట్టమొదటి రాజా-రాణిగా ఎవరు ఉండేవారు? ఇది కూడా ఎవరికీ తెలియదు. రామ-రామ అని అంటూ రాముడిని పైకి తీసుకువెళ్ళారు, కృష్ణుడిని కిందకు తీసుకువచ్చారు. సత్యయుగం గురించైతే వారికి తెలియనే తెలియదు. మీరు ప్రదర్శినీలో కూడా ఇలా రాయండి - ప్రతి ఒక్క మనిషిలో 5 భూతాలు ప్రవేశించి ఉన్నాయి, తక్కువలో తక్కువ 7 రోజులు భట్టీలో ఉన్నట్లయితే ఈ భూతాలన్నీ పారిపోతాయి, వాటికి జ్ఞానం మరియు యోగం యొక్క ధూపం కావాలి. ఇవి లేకుండా ఎప్పుడూ ముక్తి-జీవన్ముక్తిని పొందలేరు. ఈ జ్ఞాన యోగాల ఇంజెక్షన్ ఒక్క సర్జన్ వద్ద మాత్రమే ఉంది. ఇప్పుడు ఈ జ్ఞానం ఆత్మకు లభిస్తుంది. బాబా మాకు అర్థం చేయిస్తున్నారని ఆత్మ అర్థం చేసుకుంటుంది. పరమపిత పరమాత్మ మమ్మల్ని చదివిస్తున్నారు అని ఇంకే భాషలోనూ ఇలా అనరు. భగవంతుడు స్వయం కూడా నిరాకారుడు, అలాగే పిల్లలు కూడా నిరాకారులు. నిరాకారుడు ఈ సాకారుని ద్వారా సాకారీ పిల్లలకు జ్ఞానాన్ని ఇస్తున్నారు. ఇది మీకు చాలా బాగా తెలుసు. కానీ నడుస్తూ-నడుస్తూ చాలామంది పిల్లలు మర్చిపోతారు. మర్చిపోవడానికి కూడా

మొట్టమొదటి కారణం దేహాభిమానం యొక్క భూతము. దానిని పారద్రోలే పురుషార్థం అమృతవేళనే చేయాలి. అమృతవేళ బాబా స్మృతి బాగా ఉంటుంది. స్మరిస్తూ-స్మరిస్తూ సుఖాన్ని పొందండి అని అంటారు. ఇది అమృతవేళ నియమమే. భక్తులు కూడా అమృతవేళనే స్మరణ చేస్తారు. ఓ నా మనసా, ప్రభాత వేళలో రామ నామమును స్మరించు... అని అంటారు. రాముడిని స్మరించు అని ఆత్మ, బుద్ధికి చెప్తుంది. భక్తి మార్గంలో ఊరికినే ఇలాంటి సామెతలను తయారుచేస్తారు. ఇవి వాస్తవాలు కాదు. కామము కూడా భూతము అని భావించరు. అందరిలోనూ 5 భూతాలు ఉన్నాయని మీరు రాయవచ్చు. మొదటి నంబరు, దేహాభిమానము. తర్వాత రెండవ నంబరు, కామం మహాశత్రువు. ఇంతకుముందు స్కూల్లో కూడా చదివించేవారు, ఏమనంటే - మీరు ఆత్మ, ఈ శరీరం 5 తత్వాలతో తయారుచేయబడినది, ఆత్మ అవినాశీ, శరీరం వినాశీ అని. ఇప్పుడు ఈ చదువు మొదలైనవేవీ లేవు. ఇప్పుడు పిల్లలైన మీకు పూర్తి-పూర్తి పరిచయం ఇవ్వడం జరుగుతుంది. ప్రెసిడెంటును తప్పకుండా ప్రెసిడెంటు అనే అంటారు, ప్రైమ్ మినిస్టరును ప్రైమ్ మినిస్టరు అనే అంటారు, ఇరువురి కర్తవ్యాలు ఎవరివి వారివి. అలాగే, పరమపిత పరమాత్మ మరియు త్రిమూర్తులు, వీరి కర్తవ్యాలు కూడా ఎవరివి వారివి. శివుడిని పతిత-పావన అని అంటారు. వారు బ్రహ్మ ద్వారా పతితులను పావనంగా చేస్తారు, ఇది వారి డ్యూటీ. ఇప్పుడు అందరికన్నా పెద్దవారైతే శివ్. శివబాబా ఎప్పుడూ జనన-మరణాల్లోకి రారు. ఇకపోతే, బ్రహ్మ ద్వారా సేవ చేస్తారు. శివబాబా సదా పవిత్రులు. బ్రహ్మ-విష్ణువులు పునర్జన్మల్లోకి వస్తారు. శివబాబా అయితే చేసేవారు-చేయించేవారు. ఈ సమయంలో బాబా మధురమైన వృక్షం యొక్క అంటు కడుతూ ఉన్నారు. ఎవరైతే ఇతర ధర్మాల్లోకి కన్వర్ట్ అయిపోయారో, వారంతా బయటకు వస్తారు. ఇంత వివరణ అయితే కొత్తవారు ఎవరూ అర్థం చేసుకోలేరు. 7 రోజులు భట్టీలో ఉండడం ద్వారా తప్ప ముక్తి-జీవన్ముక్తులను ఎవరూ పొందలేరు. మీరు కూడా భూతాలను తొలగించడానికి ఎంత శ్రమ చేసారు. బుద్ధి ఎప్పుడైతే పవిత్రంగా ఉంటుందో, అప్పుడు జ్ఞానామృతం నిలవగలదు. నిజంగా బాబా స్మృతిని మర్చిపోతున్నాము అని పిల్లలైన మీరు అర్థం చేసుకోగలరు. చాలా దేహాభిమానం రావడంతో మళ్ళీ మిత్ర-సంబంధీకులు మొదలైనవారి వైపుకు ప్రేమ వెళ్ళిపోతుంది. ఎవరికీ మోహం యొక్క భూతం రాకూడదు. బాబాకు ఎంతమంది పిల్లలున్నారు, అయినా మోహం యొక్క విషయమే లేదు. ఆత్మ ఎప్పుడూ మరణించదని తెలుసు. మరణించే విషయంలోనే భయం ఉంటుంది. ఆత్మ కూడా అవినాశీ, పరమాత్మ కూడా అవినాశీ, వారు జనన-మరణాలలోకి రారు. బాబా అంటారు, నేను ఈ శరీరం యొక్క లోన్ తీసుకుంటాను, నేను ఉండడంతో వీరికి చాలా లాభం ఉంది, వీరి ఆయువు పెరుగుతుంది, పుష్పంలా అవుతారు, వీరి లోపాలు అన్నింటినీ సమాప్తం చేసి పూర్తిగా కొత్తగా తయారుచేస్తాను. బాబా అయితే సుఖదాత. నా కారణంగా వీరు యోగం నేర్చుకుంటారు, కనుకనే ఆరోగ్యవంతునిగా అయిపోతారు. ఎవరినైనా నిందించడము, కోపం చేయడము, ఇదంతా ఆసురీ స్వభావము. సత్యయుగంలో ఈ నిందలు మొదలైనవి ఉండనే ఉండవు. పేరే ఎంత ఫస్ట్ క్లాస్ గా ఉంది - హెవెన్, వైకుంఠం, ప్యారడైజ్. క్రైస్టుకు 3 వేల సంవత్సరాల క్రితం భారత్ ప్యారడైజ్ గా ఉండేదని అంటారు. ఈ లెక్కన తప్పకుండా మొత్తం 5 వేల సంవత్సరాలే అయినట్లు. ఈ సత్య జ్ఞానం మరియు సత్యనారాయణ కథ ఎంత సహజమైనవి. ఇప్పుడు మనం నరుడి నుండి నారాయణుడిగా అయ్యేందుకు రాజయోగం యొక్క సత్య కథను వింటాము. ఆ తర్వాత, ఇక్కడి విషయం భక్తి మార్గంలోకి వెళ్ళిపోతుంది. విచిత్రం కదా. లక్ష్మీ-నారాయణులే రాధే-కృష్ణులుగా ఉండేవారని భారతవాసులకు తెలియనే తెలియదు. అందుకే మనం మనుష్యులు అర్థం చేసుకునేందుకు ఈ చిత్రాలను తయారుచేస్తూ ఉంటాము. పిల్లలైన మీ సెంటర్లు వృద్ధి చెందుతూ ఉంటాయి. చాలామంది సెంటర్లు తెరవాలని కోరుకుంటారు, చదివేవారు ఎంతమంది ఉన్నారు అని పరిశీలించాలి? స్కూల్లో విద్యార్థులైతే కావాలి కదా. మొదట 2-4 మంది వస్తారు, ఆ తర్వాత పెరుగుతూ ఉంటారు. వీధి-వీధిలోనూ మందిరాలు, సత్రాలు తెరవబడుతూ ఉంటాయి, అప్పుడు ఒకరిని చూసి ఒకరు, అలా చాలామంది వచ్చేస్తారు. అక్కడ సెంటరు తెరిచేందుకు యోగ్యంగా కూడా ఉండాలి కదా. తెరవడానికి అభ్యంతరం లేదు కానీ వికారాల కారణంగా విఘ్నాలు చాలా వస్తాయి. మనమైతే కేవలం గీతను వినిపిస్తాము కానీ ప్రారంభం నుండి ఈ విషం కారణంగా గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇక్కడికి వెళ్ళడం వలన విషం యొక్క పాత్ర లభించదు అని భావిస్తారు. దీని గురించి మీరా యొక్క చరిత్ర కూడా ఉంది. ఆ మాటకు వస్తే, చాలా మంది కన్యలు, బాలకులు బ్రహ్మచారులుగా ఉంటారు, వారినైతే ఎవరూ ఏమీ అనరు. ఈ విధంగా కల్పక్రితం కూడా నిందలు పడ్డారు, ఇదైతే జరిగేదే ఉంది. కొందరైతే పవిత్రత యొక్క ప్రతిజ్ఞను చేస్తారు, మళ్ళీ ఓడిపోతారు కూడా. ఇది కల్పకల్పము యొక్క లాటరీ. ఎంతవరకు వారసత్వాన్ని తీసుకుంటారు అనేది పరిశీలించడం జరుగుతుంది, ఇక కల్ప-కల్పము తీసుకుంటూ ఉంటారు. కొన్నిచోట్ల కామం లభించని కారణంగా క్రోధంలోకి వచ్చి హంగామా చేస్తారు. చాలా కష్టపెడతారు, కొడతారు కూడా. మళ్ళీ ఎప్పుడైతే అర్థం చేసుకుంటారో, అప్పుడు క్షమాపణ కూడా అడుగుతారు. అయినా కూడా, అపకారికి ఉపకారం చేయాల్సి ఉంటుంది. అచ్చా, ఇప్పుడిక పురుషార్థం చేయండి అని చెప్తారు. అపకారులకు ఉపకారం చేసి వారిని లేవనెత్తడము మంచిది. దయార్ద్ర

హృదయులుగా అవ్వాల్సి ఉంటుంది. మొట్టమొదటి శ్రమ ఆత్మాభిమానులుగా అవ్వడము. దేహాభిమానులుగా అవ్వడంతో తండ్రిని మర్చిపోతారు. ఇక పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. ప్రతి ఒక్కరి నడవడిక ద్వారా తెలిసిపోతుంది. నోటి ద్వారా ఎల్లప్పుడూ రత్నాలు వెలువడాలి, రాళ్ళు కాదు. ఇంతకుముందు రాళ్ళు వెలువడేవి, ఇప్పుడు రత్నాలు వెలువడాలి. మీ పేరే రూప్-బసంత్ (యోగ స్వరూపులు-జ్ఞాన స్వరూపులు). బాబా కూడా రూప్-బసంత్, జ్ఞానసాగరుడు మరియు వారి రూపాన్ని కూడా జ్యోతిర్లింగముగా చూపించారు, కానీ వారు నక్షత్రం వలె ఉంటారు. పూజ కోసం పెద్ద రూపాన్ని పెట్టారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత, బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మొట్టమొదట ఆత్మాభిమానులుగా అయ్యే శ్రమ చేయాలి, దేహాభిమానంలోకి ఎప్పుడూ రాకూడదు. దయార్ద్ర హృదయులుగా అయి అపకారులకు కూడా ఉపకారం చేయాలి.

2. భూతాలను పారద్రోలేందుకు అమృతవేళ విశేషంగా స్మృతిలో ఉండే పురుషార్థం చేయాలి. మధురమైన వృక్షం యొక్క అంటు కట్టడంలో బాబాకు సహాయకులుగా అవ్వాలి.

వరదానము:- అనంతమైన వైరాగ్య వృత్తి ద్వారా మేరేపన్ (నాది) యొక్క రాయల్ రూపాన్ని సమాప్తం చేసే అతీతమైన మరియు ప్రియమైనవారిగా కండి

సమయం యొక్క సమీపత అనుసారంగా వర్తమాన సమయం యొక్క వాయుమండలంలో అనంతమైన వైరాగ్యం ప్రత్యక్ష రూపంలో ఉండడం అవసరము. యథార్థమైన వైరాగ్య వృత్తి యొక్క అర్థమేమిటంటే - సర్వుల సంబంధ సంపర్కంలో ఎంత అతీతమో, అంత ప్రియము. ఎవరైతే అతీతంగా మరియు ప్రియంగా ఉంటారో, వారు నిమిత్తంగా, నిర్మానంగా ఉంటారు, వారిలో నాది అన్న భానం రాజాలదు. వర్తమాన సమయంలో నాది అనేది రాయల్ రూపంలో పెరిగిపోయింది - ఇది నా పనే, నా స్థానమే, నాకు ఈ సాధనాలన్నీ భాగ్యం అనుసారంగా లభించాయి... అని అంటారు. కనుక ఇప్పుడు ఈ రాయల్ రూపం యొక్క నాది అనేదానిని సమాప్తం చేయండి.

స్లోగన్:- పరచింతన యొక్క ప్రభావం నుండి ముక్తులుగా అవ్వాలంటే శుభచింతన చేయండి మరియు శుభచింతకులుగా అవ్వండి.

మాతేశ్వరిగారి అమూల్యమైన మహావాక్యాలు - మన బ్రాహ్మణ కులం యొక్క చిన్న ప్రపంచము

పాట:- నా ఈ చిన్న ప్రపంచాన్ని చూడండి... ఈ పాట ఏదో సమయం గురించి పాడినది ఎందుకంటే ఈ సంగమ సమయమే మన బ్రాహ్మణ కులం యొక్క చిన్న ప్రపంచము. మన ఈ పరివారం ఎటువంటిది? ఇది నంబరువారుగా తెలియజేస్తారు. మనం పరమపిత పరమాత్మ శివుని యొక్క మనవలము, బ్రహ్మ-సరస్వతులకు ముఖ సంతానము మరియు విష్ణువు, శంకరులు మన పెద్దనాన్నగారులు, పరస్పరంలో మనమందరము సోదరీ-సోదరులము. ఇది మన చిన్న ప్రపంచము... ఇంతకుమించి వేరే సంబంధాలను రచించనే లేదు. ఈ సమయానికి ఇన్ని సంబంధాలే చెప్తారు. చూడండి, మన సంబంధం ఎంత పెద్ద అథారిటీతో ఉంది. మన తాతగారు శివ్, వీరి పేరు ఎంత గొప్పది, వీరు మొత్తం మనుష్య సృష్టికి బీజరూపుడు. సర్వాత్మలకు కళ్యాణకారి అయిన కారణంగా వారిని హరహర భోళానాథుడు, శివ్, దేవాది దేవుడైన మహాదేవుడు అని అంటారు. వారు మొత్తం సృష్టి యొక్క దుఃఖహర్త, సుఖకర్త. వారి ద్వారా మనకు సుఖం, శాంతి, పవిత్రతల పెద్ద హక్కు లభిస్తుంది. శాంతిలోనైతే ఏ కర్మ బంధనాల యొక్క లెక్కాచారము ఉండదు. కానీ ఈ రెండూ పవిత్రత ఆధారంపై ఉంటాయి. ఎప్పటివరకైతే తండ్రి పాలన యొక్క పూర్తి వారసత్వాన్ని తీసుకుని తండ్రి నుండి సర్టిఫికెట్ పొందమో, అప్పటివరకు ఆ వారసత్వం లభించజాలదు. చూడండి, బ్రహ్మపై ఎంత పెద్ద కార్యం ఉంది. అశుద్ధమైన 5 వికారాలతో మలినమైన అపవిత్ర ఆత్మలను పుష్పాలుగా తయారుచేస్తారు. ఈ అలౌకిక కార్యానికి ప్రతిఫలంగా సత్యయుగంలో మొదటి నంబరు శ్రీకృష్ణుని పదవి లభిస్తుంది. ఇప్పుడు చూడండి, ఆ తండ్రితో మీకు ఎంత

సంబంధం ఉంది! కావున ఎంత నిశ్చింతగా మరియు సంతోషంగా ఉండాలి. ఇప్పుడు ప్రతి ఒక్కరూ తమ హృదయాన్ని ప్రశ్నించుకోండి, మేము పూర్తి రీతిగా వారికి చెందినవారిగా అయ్యామా? అచ్ఛా - ఓంశాంతి.